క్లుప్తంగా

విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలి

పూడూరు: వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతిఒక్కరూ విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలని ఏఈ రాజునాయక్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని రెండు సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. రెండు సబ్‌స్టేషన్ల నుంచి గ్రామాలకు వెళ్లే సింగిల్‌ఫేజ్, వ్యవసాయ పొలాలకు వెళ్లే కరెంట్ స్తంభాలకు తగులుతున్న చెట్లకొమ్మలను తొలగింపజేశారు. రైతులు, గ్రామస్తులు లూప్‌లైన్‌లతో తేలిన విద్యుత్ తీగలతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఏదైనా సమస్యలు ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

అట్టహాసంగా బడిబాట ముగింపు



బొంరాస్‌పేటలో సాముహిక అక్షరాభ్యాసం

బొంరాస్‌పేట: ఈ నెల 2నుంచి ప్రారంభమైన బడిబాట గురువారం మండల పరిధిలోని పాఠశాలల్లో అట్టహాసంగా ముగిశాయి. ఏర్పుమళ్ల, వడిచర్ల, ఎన్కేపల్లి యూపీఎస్‌తోపాటు ఆయా పాఠశాలల్లో బడిబాట ముగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఏర్పుమళ్లలో హెచ్ఎం వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులతో కలిసి సాముహిక అక్షరాభ్యాసం, పలకల పంపిణీ, మొక్కలునాటే కార్యక్రమం, క్రీడల నిర్వహణలో పాల్గొని విద్యార్థులతో ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు అంజిల్‌రెడ్డి, ఏపీపీసీ చైర్మన్ వసంత, అనంతయ్య, పూజారి శ్రీనివాస్, ఉపాధ్యాయులు సర్దార్, కిషన్, జ్యోతి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. కట్టుకాల్వతండా, ఎన్కేపల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంఈఓ హరిలాల్ పాల్గొన్నారు.

మంత్రివర్గంలో ముస్లింలకు ప్రాధాన్యతనివ్వాలి

బొంరాస్‌పేట: తెలంగాణ ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణలో ముస్లింలకు ప్రాధాన్యతనివ్వాలని టీఎస్ఎంహెచ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మొహ్మద్ వసీమ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటునకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముస్లింల ఓటుబ్యాంకు ఎంతగానో తోడ్పడిందన్నారు. ముస్లింలకు తగిన స్థానం కల్పించి గౌరవించాలని కోరారు.

నేటితో ముగియనున్న రైతు భరోసా గడువు



దుద్యాల్: రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈవో రేణుక

దుద్యాల్: నూతనంగా భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు రైతు భరోసా దరఖాస్తు చేసుకోవడానికి శుక్రవారం చివరి రోజు అని ఏఈవో రేణుక పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని హస్నాబాద్ రైతు వేదికలో రైతు భరోసా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జూన్ 5వ తేదీ నుంచి భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పట్టా పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, దరఖాస్తు ఫారంతో పూర్తి వివరాలు నమోదు చేసి తీసుకురావాలని సూచించారు.

రైతు భరోసా ఆఖరు

తాండూరు రూరల్: రైతు భరోసా దరఖాస్తు చేసుకునేందుకు శుక్రవారం ఆఖరని మండల వ్యవసాయ శాఖ అధికారి కొమురయ్య పేర్కొన్నారు. పాసు పుస్తకం వచ్చిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాకున్న పీపీబీ నంబర్ ఉంటే సరిపోతుందని పేర్కొన్నారు. ఆధార్, బ్యాంక్ అకౌంట్, దరఖాస్తు ఫాం పూర్తి చేసి సంబంధిత వ్యవసాయ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

దోమ: మండల పరిధిలోని దిర్సంపల్లి, గుండాల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ జి వినయ్‌కాంత్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరిగి పట్టణంలోని 132కేవీ నుంచి రాపోల్‌లోని 33కేవీ సబ్‌స్టేషన్ వరకు మరమ్మతులు చేపడుతున్న సందర్భంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు వినయ్‌కాంత్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గ్రహించి తమకు సహకరించాలని కోరారు.

సర్కారుకే 'సై'



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు

బడికోసం.. సంఘటితం

- మా పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలకే పంపుతాం
- గ్రామ మహిళా సంఘాల ఏకగ్రీవ తీర్మానం
- ప్రతిజ్ఞ చేయించిన మహిళా సంఘాల ప్రతినిధులు

బొంరాస్‌పేట: ప్రైవేట్ పాఠశాలలు వద్దు.. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం.. సీఎం ఆదేశాలు, దాన్ని అనుసరిస్తున్న అధికారులు, నాయకుల ఆకాంక్షను నెరవేర్చేందుకు వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలం ఎన్కేపల్లి గ్రామ మహిళాసంఘం సభ్యులు కంకణం కట్టుకున్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించడానికి సంఘటితమయ్యారు. సర్కారుకే పంపించేందుకు సై అంటున్నారు. ఇందుకోసం గ్రామ మహిళా సంఘాల ప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. గురువారం నిర్వహించిన గ్రామసంఘం సమావేశంలో అప్పు, పొదుపుల నిర్వహణే కాదు. తమ ఊళ్లోని ప్రభుత్వ పాఠశాల గురించి చర్చ నిర్వహించారు. సాధ్యమైనంత వరకు పిల్లలందరిని గ్రామంలోని బడికే పంపాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.

స్వచ్ఛందంగా ముందుకు వచ్చి..

గ్రామంలోని 22 మహిళాసంఘాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. తమ కుటుంబాల్లోని విద్యార్థులను ప్రయివేటు పాఠశాలలకు పంపించం, గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తామని మూకుమ్మడిగా ఒప్పందం చేసుకున్నారు. ఎనిమిదో తరగతి వరకు ఉన్న పాఠశాల, ఈ యేడాది మండలంలోనే ఎక్కువగా గురుకుల సీట్లు సాధించారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులకు మరింత ప్రోత్సాహం అందించేందుకు ఈ తీర్మానం చేశామన్నారు.

బడిని కాపాడుకోవడానికి..



15 యేళ్లక్రితం మా ఊరిలో ఎనిమిదో తరగతి వరకు పెంచారు. అప్పటి నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థుల కొరత కారణంగా ఎనిమిదికే పరిమితమైంది. ఈ సారి ఉపాధ్యాయులు, విద్యావాలంటీర్ల ప్రత్యేక చొరవతో గురుకులాల సీట్లు వచ్చాయి. ప్రైవేట్ కంటే ఊళ్లోని ప్రభుత్వ పాఠశాలపై నమ్మకం ఏర్పడింది. బడి అభివృద్ధికోసం ఈ తీర్మానం చేశాం.

– పెద్దకుర్వ బసమ్మ, మహిళాసంఘం అధ్యక్షురాలు, ఎన్కేపల్లి

విద్యార్థుల వివరాలు..



వేసవి సెలవులకు ముందే ఉపాధ్యాయులు వచ్చి వేరేగ్రామాలకు, ప్రైవేట్‌కు వెళ్తున్న విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. సర్వే కోసం మా సంఘాలకు సంబంధిత ఫారాలు అందజేశారు. దాని ఆధారంగా గ్రామంలోని విద్యార్థుల సంఖ్యను తేల్చాం. ఉన్నత పాఠశాలకు అవకాశం ఉందని గుర్తించాం. అందుకు తగిన విధంగా పాఠశాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తాం.

– మహాలక్ష్మి, వీఓఏ, ఎన్కేపల్లి

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గురువు శ్యాములయ్యగౌడ్



యోగా శిక్షణ తరగతుల్లో విద్యార్థులు

కొడంగల్ రూరల్: ప్రతీరోజు యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని గురువు శ్యాములయ్యగౌడ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మూడు రోజులపాటు పట్టణంలోని కేఎస్‌వీ ఫంక్షన్ హాల్లో సేవా భారతి(ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో 20, 21వ తేదీల్లో ఉదయం 5–30గంటల నుంచి 7–30గంటల వరకు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. గురువారం ప్రారంభించిన యోగా తరగతులకు హాజరైన సభ్యులకు యోగా గురువు ప్రాధాన్యతను వివరించారు. ఇప్పుడు ప్రపంచమంతా భారతీయ ఆధ్యాత్మికత కోసం ఎదురుచూస్తోందన్నారు. భారతీయులంతా సంస్కృతి సంప్రదాయలను గౌరవించి, పరిరక్షించాలన్నారు. యోగాతో మానసిక ధైర్యంతోపాటు శారీరక దృఢత్వం కలుగుతుందన్నారు. చిన్న పిల్లలకు ప్రాథమిక విద్యాస్థాయి నుంచి యోగా నేర్పించడం ద్వారా మానసికంగా దృడంగా తయారవుతారన్నారు. శుక్ర, శని వారాల్లో నిర్వహించనున్న శిక్షణ తరగతులకు అత్యధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయండి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ తులసి

కొడంగల్: రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారిణి తులసి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రుద్రారం రైతు వేదికలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. విత్తనాలు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రభుత్వం ధ్రువీకరించిన నాణ్యమైన అధిక దిగుబడినిచ్చే విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. తెగుళ్లను తట్టుకొని పురుగులను నిరోధించగలిగే విత్తనాలను పొలాల్లో విత్తుకోవాలని సూచించారు. రైతులు సొంతంగా తయారు చేసుకున్న విత్తనాలను శుద్ధి చేసిన తర్వాతే పొలాల్లో విత్తాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీపతి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, రైతులు ఆనంద్‌రెడ్డి, వెంకటయ్య గౌడ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామ శివారులో పత్తి పంటను పరిశీలించారు.

కార్యదర్శుల మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీని సన్మానిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ తదితరులు

కుల్కచర్ల: పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. మండల కమిటీ అధ్యక్షుడిగా అశోక్, ప్రధాన కార్యదర్శిగా కడంపల్లి రాఘవేందర్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా శివ, ట్రెజరర్ శైలజ రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ హరిశ్వర్ రెడ్డి, సహాయ కార్యదర్శి శంకర్ రెడ్డి, మహిళా విభాగం మైమునా బేగం, ఎల్లమ్మ, ఆర్గనైజేషన్ సెక్రటరీ దేవ్‌సింగ్, ఆయూబ్, విజయలక్ష్మి, కవిత, సోషల్ మీడియా ఇన్‌చార్జి సంతోశ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీ నేతలు మాట్లాడుతూ..పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై తాము నిర్విరామంగా పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కులకచర్ల ఎంపీడీఓ రామకృష్ణ నాయక్, ఇన్‌చార్జి ఎంపీఓ భాస్కర్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నతనం నుంచే విలువలు నేర్పాలి



ఎంఈఓ హరిలాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు, హెచ్ఎంలు

సద్గురు రామబ్రహ్మానందస్వామి

బొంరాస్‌పేట: చిన్నతనం నుంచే విలువలు నేర్పాలని శ్రీగీతా జ్ఞాన గురుభక్త మండలి సద్గురు రామబ్రహ్మానందస్వామి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎన్కేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నోటుపుస్తకాలు అందజేశారు. విద్యార్థులకు పాఠాలతోపాటు ఆధ్యాత్మికం, సేవాభావం నేర్పించాలన్నారు. ఏకగ్రతను దెబ్బతీసే సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉంచాలని ఆయన సూచించారు. గురుభక్త మండలి వెంకటేశం, సభ్యులు పాల్గొన్నారు.

వినతి

స్థానిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ఇద్దరు ఉపాధ్యాయులున్న యూపీఎస్ పాఠశాలకు మరికొంత మంది ఉపాధ్యాయులను కేటాయించాలని మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు ఎంఈఓ హరిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ హెచ్ఎం రవీందర్‌గౌడ్, హెచ్ఎం జ్యోతిపరమేశ్వరి, సీఆర్‌పీ సోమ్లా, ఉపాధ్యాయుడు మహేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన నాయకులు
- నోటు పుస్తకాల పంపిణీ



పరిగి: జన్మదిన వేడుకలు జరుపుకొంటున్న కాంగ్రెస్ నాయకులు

కొడంగల్: పట్టణంలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పుట్టిన రోజును పురస్కరించుకొని కొడంగల్‌లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, యువజన కాంగ్రెస్ జాతీయ సమన్వయ కర్త కృష్ణంరాజు, ఉపాధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఒకరినొకరు శుభాకాంక్షలు తెలిపారు.

రాహుల్‌కు శుభాకాంక్షలు

బొంరాస్‌పేట: స్థానిక భూలక్ష్మి చౌరస్తాలో మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. ఒకరినొకరు శుభాకాంక్షలు తెలిపారు. వెంకట్రాములుగౌడ్, జయకృష్ణ, మల్లేశం, రాంచంద్రారెడ్డి, నర్సింలునాయుడు, రాములు తదితరులు పాల్గొన్నారు.

బంట్వారం: కోట్‌పల్లి కేజీబీవీ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య కేజీబీవీ హాస్టల్‌కు 10 కుర్చీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బందయ్య, జ్ఞానేశ్వర్, రియాజ్, నర్సింలు, అజీం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: కార్యకర్తలు కేక్ కట్‌చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి క్రిష్ణ, తౌర్యానాయక్, మల్లేశ్, పాల్గొన్నారు.

పూడూరు: యువత రాజకీయాల్లోకి వస్తేనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల సతీష్‌రెడ్డి అన్నారు. మన్నెగూడ పార్టీ కార్యాలయంలో జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శులు అజీం పటేల్, పెంటయ్య, శ్రీనివాస్, మండల అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లి: మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో కేక్ కట్ చేసి ఒకొరినొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్, పట్లూర్ మాజీ ఎంపీటీసీ స్వప్నసురేశ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం చైర్మన్ నిఖిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే గుర్తింపు రద్దు



ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య గౌడ్

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంతో ఎంఈఓ సమావేశం

తాండూరు టౌన్: విద్యార్థుల నుంచి ట్యూషన్ ఫీజు కాకుండా ఎలాంటి ఇతర ఫీజులు వసూలు చేసినా ఆయా పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తామని మండల విద్యాధికారి వెంకటయ్య గౌడ్ పేర్కొన్నారు. గురువారం ఆయన తాండూరు మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ ఎంస్ నంబర్ 1 ప్రకారం అధిక ఫీజులు వసూలు చేయొద్దన్నారు. ఫీజుల విషయంలో విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావద్దన్నారు. పాఠశాల ప్రాంగణలో పుస్తకాలు, నోటుబుక్కులు విక్రయించొద్దని సూచించారు. అనుమతి లేకుండా పాఠశాలలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏ పాఠశాల యాజమాన్యం ప్రవర్తించినా వారిపై చర్యలు తప్పవన్నారు.

నరేందర్ రెడ్డికి గెలవననే భయం

- కుదురుమల్లలో కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీని వీడలేదు
- దుద్యాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్

దుద్యాల్: దుద్యాల్ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఓర్వలేక పోతున్నారు. కాంగ్రెస్‌పై అబద్దాలు ప్రచారం చేస్తున్నారని దుద్యాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుటి శేఖర్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుదురుమల్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ అసంతృప్త కార్యకర్తలను బుజ్జగించారు. తిరిగి అదే పార్టీలో చేర్చుకుని కాంగ్రెస్ కార్యకర్తలు చేరారని అబద్దపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. కుదురుమల్ల గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎక్కడికి పోలేదని, అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు. ఎవరు కూడా అధైర్య పడొద్దని, ప్రభుత్వ పథకాలు అందరికి అందుతాయని గుర్తు చేశారు. త్వరలోనే అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయన్నారు.

ప్రభుత్వ బడిలో చేర్పించండి

- ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి
- పెరుగుతున్న హాజరు

ధారూరు: మండలంలోని పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం క్రమంగా పెరుగుతుందని మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి గురువారం తెలిపారు. మండలంలోని 53 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మొత్తం 3,300 మంది విద్యార్థులు ఉన్నారని ఆయన వివరించారు. పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజు 826 మంది హాజరయ్యారన్నారు. అక్షయపాత్ర ద్వారా మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. హైదరాబాద్ నగరంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరేందుకు పోటీపడుతున్నారని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

నోట్ పుస్తకాల పంపిణీ



కుల్కచర్ల: విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందిస్తున్న తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, స్థానిక నాయకులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని వీర్‌శెట్టిపల్లి గ్రామానికి చెందిన ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు ఫిరంగి జర్నప్ప సొంత డబ్బులతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో..

దౌల్తాబాద్: మండలంలోని నీటూరు గ్రామంలో అంగన్‌వాడీ–1 కేంద్రంలోని 15 మంది చిన్నారులకు గ్రామానికి చెందిన చిట్లపల్లి అంజిలప్ప విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది అంగన్‌వాడీ చిన్నారులకు తనవంతుగా బ్యాగులు, ప్యాడ్‌లు, పుస్తకాలు, పలకలు అందజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ భారతి, తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలను సద్వినియోగించుకోవాలి

కుల్కచర్ల: విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కుల్కచర్ల తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి అన్నారు. గురువారం చెల్లాపూర్ గ్రామంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ఏకరూప దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్యం గల ఉపాధ్యాయులతో విద్యాబోధన చేపడుతున్నారన్నారు. గ్రామస్తులందరూ తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తుప్పలి ఆనంద్‌కుమార్, గిర్దవరులు ఖాజ, రవి, నాయకులు కొండ ఆంజనేయులు, నీలయ్య, రెవెన్యూ సిబ్బంది అనిత, స్వప్న, ఉపాధ్యాయులు శ్రీనివాస్, దస్తయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యలు పరిష్కారం

తహసీల్దార్ తారాసింగ్



దోమ: ఐనాపూర్‌లో రైతుల ఫిర్యాదులను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోవిందమ్మ

తాండూరు రూరల్: రెవెన్యూ సదస్సులతో రైతుల భూ సమస్యలు పరిష్కరించొచ్చని తహసీల్దార్ తారాసింగ్ పేర్కొన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించేందుకు ప్రతీ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. శుక్రవారంతో ఈ సదస్సులు ముగుస్తాయన్నారు. కావున పట్టణంలోని సాయిపూర్, మల్‌రెడ్డిపల్లిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే సదస్సుకు రైతులు హాజరు కావాలని సూచించారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి : గోవిందమ్మ

దోమ: రైతుల భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తహసీల్దార్ గోవిందమ్మ అన్నారు. ఐనాపూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు.

నాందార్‌పూర్‌లో..

బొంరాస్‌పేట: మండల పరిధిలోని నాందార్‌పూర్‌లో నిర్వహించిన సదస్సులో తహసీల్దారు పద్మావతి పాల్గొన్నారు. భూసమస్యల పరిష్కారంలో రైతులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శిరీష, రవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ సదస్సు

పరిగి: పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఆనంద్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

155 దరఖాస్తులు..

బషీరాబాద్: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఉపయోగపడుతాయని తహసీల్దార్ పేర్కొన్నారు. బషీరాబాద్ మండలంలోని 31 రెవెన్యూ గ్రామాల్లో రైతుల నుంచి 155 అర్జీలు అందినట్లు తహసీల్దార్ షాహెదాబేగం తెలిపారు.